అట్టహాసంగా నామినేషన్ల పర్వం


ర్యాలీలో అభివాదం చేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్


ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందిస్తున్న బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్

నాంపల్లి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నాంపల్లి పటేల్ బాడా నుంచి ర్యాలీగా విజయనగర్ కాలనీ తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ కార్యాలయానికి చేరుకున్నారు. నాంపల్లిలో తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, ఎంఐఎం మధ్యనే పోటీ ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ నేత ప్రదీప్ అగర్వాల్, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో బాలలు..

నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్ ఖాన్ గురువారం విద్యార్థులతో కలిసి ర్యాలీని చేపట్టారు. విజయనగర్ కాలనీలోని 63–నాంపల్లి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి ఆయన బాల బాలికలతో వచ్చి నామినేషన్‌ను వేశారు. అనంతరం విభిన్న వేషధారణల్లో వచ్చిన విద్యార్థులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లేపల్లిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న సమయంలో విద్యార్థులను ఎన్నికల ప్రచారంలో వినియోగించరాదు. కానీ మహ్మద్ ఫిరోజ్ ఖాన్ విద్యార్థులను నామినేషన్ ర్యాలీకి ఆహ్వానించి వార్తల్లోకి ఎక్కారు.

కార్వాన్ బీజేపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు

గోల్కొండ: కార్వాన్ బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ గురువారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. గురువారం గోల్కొండ మండల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి సాదాసీదాగా వచ్చిన ఆయన తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు డిజ్వర్‌సింగ్ తదితరులున్నారు.

ముస్లింలు సైతం తమ పార్టీకే ఓటు వేయనున్నారు..

చార్మినార్: ముస్లిం మైనార్టీ ఓటర్లు సైతం తమ పార్టీకే ఓటు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ధీమా వ్యక్తం చేశారు. గురువారం తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన చార్మినార్ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేశారు.

నామినేషన్ వేసిన చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణి..

చార్మినార్ నుంచి బీజేపీ అభ్యర్థి మెఘారాణి గురువారం భారీ ర్యాలీగా తరలివెళ్లి తన నామినేషన్ దాఖలు చేశారు. సంప్రదాయ దుస్తుల్లో పగిడీలు ధరించి ఓపెన్ టాప్ జీప్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు ద్విచక్ర వాహనాలపై వెంట రాగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో తిరుగుతూ మొఘల్‌పురాలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు.

మీర్ జుల్ఫికర్ అలీ నామినేషన్ దాఖలు..

చార్మినార్ నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫికర్ అలీ గురువారం భారీ ర్యాలీగా తరలివెళ్లి తన నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లు ముజఫర్, సొహేల్ ఖాద్రీలతో పాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజేశ్‌కుమార్ నామినేషన్ దాఖలు..

దూద్‌బౌలి: బహదూర్‌పురా శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్‌కుమార్ గురువారం తన నామినేషన్ దాఖలు చేశారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్, సీనియర్ నాయకులు కన్నయ్యలాల్ తదితరులతో పాటు పార్టీ అభిమానులు, కార్యకర్తలు,నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీగా నిర్వహించిన ర్యాలీ అనంతరం బహదూర్‌పురా రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ అందజేశారు.


నామినేషన్ అందజేస్తున్న మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫికర్ అలీ


బాల బాలికలతో మహ్మద్ ఫిరోజ్ ఖాన్ ర్యాలీ


ఆర్వో వెంకన్నకు నామినేషన్ అందజేస్తున్న మహ్మద్ సలావుద్దీన్ లోధీ


ఆర్వోకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న పులిపాటి రాజేశ్‌కుమార్


నామినేషన్ అందజేస్తున్న మెఘారాణి

యాకుత్‌పురా ఎంబీటీ అభ్యర్థిగా అంజదుల్లా ఖాన్



చార్మినార్: మజ్లిస్ బచావ్ తహ్రీక్(ఎంబీటీ) పార్టీ అధికారి ప్రతినిధి అంజదుల్లాఖాన్ యాకుత్‌పురా అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటారని ఆ పార్టీ అధ్యక్షుడు మాజీదుల్లా ఖాన్ గురువారం ప్రకటించారు. ఎంబీటీ వ్యవస్థాపకుడు దివంగత అమానుల్లాఖాన్ చిన్న కుమారుడైన అంజదుల్లా ఖాన్ అప్పటి చంచల్‌గూడ డివిజన్‌తో పాటు ఆజంపురా డివిజన్ల నుంచి కార్పొరేటర్‌గా రెండు సార్లు విజయం సాధించారు. ఇక ఈసారి యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: కౌసర్


సమావేశంలో మజ్లిస్ అభ్యర్థి కౌసర్

గోల్కొండ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని కార్వాన్ మజ్లిస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం నానల్‌నగర్ డివిజన్ ఖాదర్‌బాగ్‌లో సీనియర్ సిటిజన్స్ ఫోరం, మజ్లిస్ సీనియర్ నాయకుడు షబ్బీర్‌ఖాన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ఫోరం వారు ఆయనను సన్మానించారు. తమ ఫోరం ఎప్పుడూ మజ్లిస్ అభ్యర్థులను బలపరుస్తూ వస్తుందని, ఈసారి కూడా తాము మజ్లిస్‌కే ఓటు వేస్తామని ఫోరం ప్రతినిధులు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో సీనియర్ సిటిజన్ల కోసం ఒక ప్రత్యేక భవనం నిర్మించడానికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు షబ్బీర్‌ఖాన్, జహంగీర్, ఇస్మాయిల్, మున్వర్ తదితరులున్నారు.

'చార్మినార్‌లో బీజేపీ జెండా ఎగరేస్తాం'



చార్మినార్: దశాబ్దాలుగా పాతబస్తీలో అధికారం చెలాయిస్తున్న మజ్లిస్ పార్టీకి ఈసారి గట్టిగా బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని కేంద్ర సహాయ మంత్రి అజయ్ భట్ అన్నారు. గురువారం చార్మినార్‌లో బీజేపీ అభ్యర్థి మెఘారాణి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారం, నామినేషన్ దాఖలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో అభివృద్ధి కుంటుపడడానికి మజ్లిస్ పార్టీయే కారణమన్నారు. ఈసారి తప్పని సరిగా చార్మినార్ నుంచి విజయం సాధించి చార్మినార్‌లో బీజేపీ జెండా ఎగరేస్తామన్నారు. బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, ఉమేష్ సింగానియా, పవన్ మిశ్రా పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరు'


కిషన్‌రెడ్డిని కలిసిన మాణిక్ ప్రభు, ముక్క కృష్ణ గుప్తా, శశికాంత్ కులకర్ణి

అబిడ్స్: కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మరని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గోషామహల్, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు మాణిక్ ప్రభు, ముక్క కృష్ణాగుప్తా, శశికాంత్ కులకర్ణి మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ప్రచారంపై ఆయనతో చర్చించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ప్రజలను మోసం చేసే విధంగా ప్రచారం చేస్తున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పథకాలకు ఆకర్షితులై మొగ్గుచూపుతున్నారన్నారు. బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

రాష్ట్రంలో బీజేపీ ప్రభంజనం


బీజేపీ నాయకుడు యోగ్‌రాజ్‌సింగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ ప్రభంజనం కొనసాగుతుందని ఆ పార్టీ నాయకుడు యోగ్‌రాజ్‌సింగ్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లో ఆయన బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు వచ్చే ఎన్నికల్లో తిరస్కరిస్తారన్నారు. అంతేకాకుండా మతం పేరుతో రాజకీయ పబ్బం గడుపుకుంటున్న మజ్లిస్ పార్టీకి కూడా మైనార్టీలు ఈసారి గట్టి గుణపాఠం నేర్పుతారని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. టోలిచౌకి బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ చారి, రామకృష్ణ, వీర్‌సింగ్ తదితరులున్నారు.

నేటి నుంచి భాగ్యలక్ష్మి ఆలయంలో దీపావళి వేడుకలు


అమ్మవారు

చార్మినార్: చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో దీపావళి వేడుకలు ఈ నెల 10న ప్రారంభమై 15వ తేదీతో ముగియనున్నాయి. ఈనెల 10న ధన్‌తేరస్‌ను పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 7 గంటలకు హారతి, సాయంత్రం 7 గంటలకు అమ్మవారి దీప్ దర్శనం తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 11న నిర్వహించనున్న చోటా దీపావళి (నరక చతుర్దశి)ని పురస్కరించుకొని భక్తులకు అమ్మవారి ప్రథమ దర్శనం ఉంటుంది. అప్పటి నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు అమ్మవారి దర్శనం కొనసాగనున్నట్లు ఆలయ ట్రస్టీ శశికళ తెలిపారు. 12న శుభ దీపావళిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దీపావళికి అమ్మవారు మోహినీ రూపంలో దర్శనమివ్వనున్నారని, భక్తులకు ఖజానాను పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే అభిషేకం కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు డ్రెస్సు కోడ్ ఉంటుందని శశికళ తెలిపారు.

ఆకట్టుకున్న వరేణ్యం-23 ఫ్యాషన్ షో



గోల్కొండ: తారామతి బారాదరిలో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అరవింద్ ఆంపుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వరేణ్యం–23 ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. వీకా ఫ్యాషన్ షో పేరుతో జరిగిన ఈ ఫ్యాషన్ షోలో డిజైనర్లు సృష్టించిన అద్భుతమైన కలెక్షన్లు ఆకట్టుకున్నాయి. వరుణ్ చక్కిలం రూపొందించిన వధూవరుల డిజైన్లు అదిరాయి. ప్రముఖ డిజనర్లు రాజ్యలక్ష్మి మ్రుగుబ్బా, మృణాళినిరావు దుస్తులు ఆకట్టుకున్నాయి. మిస్ ఇండియా 2023 మొదటి రన్నరప్ శ్రేయా పూంజా, తన హావభావాలతో ఆకట్టున్నారు. హర్షిత వైష్ణవ్, శిల్పారెడ్డి, తమ హొయలతో అలరించారు.

'సుందరకాండం' పద్య కావ్యం ఆవిష్కరణ

నాంపల్లి: బ్రహ్మశ్రీ పెండ్యాల కిషన్ శర్మ విరచితమైన పద్య కావ్యం 'సుందర కాండం'ఆవిష్కరణ, అంకితోత్సవ సభ గురువారం ఏసీగార్డ్స్‌లోని నఫీజ్ రెసిడెన్సీలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని తెలుగు సాహితి సదస్సు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాహితీవేత్త విహారి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి హాజరై సుందరకాండం పద్య కావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని విశిష్ట కవి ఆచార్య దేవరాజ రాంభావుకు అంకితమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆచార్య మాసన చెన్నప్ప, గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు, ముదిగొండ విశ్వేశ్వర శాస్త్రి, పుస్తక శిల్పి తాళ్లపల్లి మురళీధర గౌడ్, సదస్సు కార్యదర్శి తుమ్మూరి రాం మోహన్ రావు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ


మాట్లాడుతున్న ఆచార్య తంగెడ కిషన్ రావు

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గురువారం 'తెలుగులో పరీక్షా మూల్యాంకనం–ప్రశ్నాంశ రచన' అనే అంశంపై శిక్షణ శిబిరం ప్రారంభమైంది. వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు సదస్సును ప్రారంభించారు. తెలుగు ఉపాధ్యాయులకు, భాషా పరిశోధకులకు ఇలాంటి శిక్షణా శిబిరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, తద్వారా వారి భాషా ప్రతిభా పాటవాలకు మరింత మెరుగులు దిద్దుకుంటారని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా భారతీయ భాషా సంస్థ దేశంలోని పలు భాషలలో ఈ విధమైన కార్యక్రమాలను రూపొందించినందుకు అభినందనలు తెలిపారు. తెలుగు వర్సిటీ భాషాభివృద్ధి పీఠం పీఠాధిపతి ఆచార్య రెడ్డి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సేవలు వెలకట్టలేనివి


సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్

గోల్కొండ: ఆశావర్కర్ల సేవలు వెలకట్టలేనివని హైదరాబాద్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.శ్రీనివాస్ అన్నారు. గురువారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఆయన ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ వైద్యుల పనితీరుపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేషెంట్లకు వారి ఇంటి వద్ద కౌన్సెలింగ్ నిర్వహించి వారిని ప్రభుత్వ ఆస్పత్రుల వద్దకు తీసుకురావడంలో ఆశావర్కర్లు ఎంతో ఓపికతో పని చేస్తున్నారన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యులు రోగులకు అవసరమైన సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోన్ ఎస్‌పీహెచ్‌ఈఓ డాక్టర్ హర్షయాదవ్, గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్‌ఉల్లా, వైద్య అధికారులు పాల్గొన్నారు.

ధంతేరస్‌తో దీపావళి వేడుకలు ప్రారంభం

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఇప్పటికే తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 10న ధంతేరస్‌ను పురస్కరించుకొని తెల్లవారుజామున 4 గంటల నుంచి అమ్మవారికి మహాభిషేకం, అలంకారం, శ్రీచక్ర అర్చన, ఆంజనేయస్వామికి అభిషేకం, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలతో పాటు సాయంత్రం 6 గంటలకు 108 అష్టోత్తర దిపోత్సవం కార్యక్రమాలు ఉంటాయి. 11న నరక చతుర్దశిని పురస్కరించుకొని ఉదయం 5 గంటల నుంచి మహాభిషేకం, అలంకారం, సహస్రనామ కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం 6 గంటలకు 108 అష్టోత్తర దిపోత్సవం, రాత్రి 8 గంటలకు పంచ హారతి తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయి. అలాగే ఈనెల 12న దీపావళి దినాన్ని పురస్కరించుకొని శివుడికి రుద్రాభిషేకం, ఆకు పూజ తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయి.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించండి


సమావేశంలో పాల్గొన్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. గృహకల్ప కార్యాలయంలో జిల్లా టీఎన్జీవోస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల సహకారా సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వివిధ యూనిట్లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు ఆర్.రంజన్, రేచల్‌లను ముజీబ్ సత్కరించారు. విక్రమ్‌కుమార్, కేఆర్.రాజ్‌కుమార్, ఉమార్ ఖాన్, కుర్రాడి శ్రీనిస్, నరేష్‌కుమార్, ప్రభాకర్, శ్రీధర్ నాయుడు పాల్గొన్నారు.

'ఈసారి కాంగ్రెస్ పార్టీదే అధికారం'


ఎన్నికల ప్రచారంలో నిరంజన్ తదితరులు

చార్మినార్: ఈసారి కాంగ్రెస్ పార్టీదే అధికారమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం బహదూర్‌పురాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఫతేదర్వాజలోని వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ ఎన్నికల్లో తమను గెలిపిస్తే.. ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తామని బహదూర్‌పురా శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్, సీనియర్ నాయకులు కన్నయ్యలాల్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో హ్యాట్రిక్ సాధిస్తా: రాజాసింగ్


చుడిబజార్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: పదేళ్లపాటు గోషామహల్ నియోజకవర్గంలో తాను చేపటిన కోట్లాది రూపాయల అభివృద్ధి పనులతోనే మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తానని గోషామహల్ బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. చుడిబజార్ తదితర ప్రంతాల్లో ఆయన కార్పొరేటర్ శంకర్ యాదవ్‌తో కలిసి ముమ్మరంగా ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడుతూ..తాను చేపట్టిన అభివృద్ధి, ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలతోనే విజయం సాధిస్తానని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు చిత్తుగా ఓడడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్ యాదవ్, ముక్క కృష్ణాగుప్తా తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా


ధూల్‌పేట్‌లో పర్యటిస్తున్న సునీతారావు, గోకరణ్ సింగ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో ప్రజల సహకారంతో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు పేర్కొన్నారు. ధూల్‌పేట జుమ్మెరాత్‌బజార్ తదితర ప్రాంతాల్లో ఆమె ఇంటింటి ప్రచారం చేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా గోషామహల్‌లో కాంగ్రెస్‌దే విజయమన్నారు. దివంగత మాజీమంత్రి ముఖేష్ గౌడ్ హయాంలో గోషామహల్‌లో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గోకరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయం


లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: ఈసారి కార్వాన్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి ఏ.కృష్ణయ్య విజయం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కె.శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన లక్ష్మీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రజల ముద్దుబిడ్డగా పేరు గాంచారన్నారు. ఆయన ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల వేలాది నిరుపేద కుటుంబాలు, మైనార్టీలు లబ్ధిపొందారని ఆయన అన్నారు. గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, కె.వెంకటేష్, సత్యనారాయణ తదితరులున్నారు.

'ఎన్నికల సమయంలో ఎలాంటి నేరాలకు పాల్పడొద్దు'

సంతోష్‌నగర్: ఎన్నికల సమయంలో రౌడీషీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పకూడదని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ దార కవిత అన్నారు. అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని గురువారం సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 32 మంది రౌడీషీటర్లకు వారి వారి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబసభ్యులతో పాటు రౌడీషీటర్లకు ఆమె సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎన్నికల సందర్భంగా ఎవరూ ఎలాంటి నేరాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పూసపాటి శివచంద్ర, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన వ్యక్తి రిమాండ్

సంతోష్‌నగర్: వివాహేతర సంబంధం కారణంగా భార్యను హత్య చేసిన కేసులో భర్తను ఐఎస్‌సదన్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం..చంపాపేట్ ఎస్‌జీఆర్ కాలనీకి చెందిన స్వప్న (21), ప్రేమ్ కుమార్ (23) దంపతులు. ప్రేమ్ కుమార్ టీస్టాల్ నడుపుతున్నాడు. స్వప్న సురేశ్ అనే యువకుడితో మాట్లాడుతుండటంతో వీరి మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. గత నెల 28న ప్రేమ్‌కుమార్ ఇంటి నుంచి డిమార్ట్‌కు వెళ్లి కత్తిని కొనుగోలు చేసి.. తిరిగి ఇంటికి చేరుకోగా..ఇంట్లో స్వప్నతో పాటు ప్రియుడు సురేశ్ కనిపించాడు. ఆగ్రహానికి గురైన ప్రేమ్‌కుమార్ స్వప్నను కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం సురేశ్, ప్రేమ్ కుమార్ మధ్య జరిగిన పెనుగులాటలో సురేశ్ ప్రేమ్‌కుమార్‌ను భవనంపై నుంచి కిందికి తోసేశాడు. ప్రేమ్ కుమార్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో ఇప్పటికే సురేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా బుధవారం రాత్రి ప్రేమ్ కుమార్‌ను సైతం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్


నందకిషోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఈనెల 10న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు గోషామహల్‌లోని రతన్ టవర్‌లో ఉన్నా బీఆర్ఎస్ కార్యాలయం నుంచి కాలినడకన కార్యకర్తలు, నాయకులు, నియోజకవర్గానికి చెందిన అభిమానులతో కలిసి అబిడ్స్‌లోని రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 26 ఏళ్లుగా గోషామహల్ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేశానన్నారు.